**''ఏమండీ! ఈ రోజయినా క్రాపు చేయించుకోరూ?'' తలకి నూనెరాయడానికొచ్చిందల్లా ఆగిపోయి, చేతిలోని నూనె గిన్నెని కాస్తా బల్లమీద పెడుతూ అంది సావిత్రమ్మ భర్తతో. ఆ మాటతో అటు వైపు తిరిగి, చిరునవ్వుతో ఆవిడ ప్రతిపాదనని అంగీకరిస్తున్నవాడల్లే అద్దం ముందుకి జరిగేడు ముకుందరావు.**

**''జుత్తు బాగా పెరిగిపోయింది కదూ!'' అద్దంలో మొహం చూసుకుంటూ, ఓ చేత్తో క్రాపుని ఒత్తి చూసుకుంటూ అన్నాడు.**

**''ఈ తరం కుర్రకారుకీ, మీకూ అట్టే తేడా ఏం లేదు లెండి!'' వచ్చే నవ్వుని ఆపుకుంటూ అద్దంలో తన ప్రతిబింబం కనపడకుండా భర్త వెనక్కి జరిగి నుంచుంది సావిత్రమ్మ.**

**''క్రాపు చేయించుకుంటే మరి కొన్నాళ్లు వరకీ తల ఏదో బోసిగా వుంటుంది సావిత్రీ! అందుకే ఇప్పుడప్పుడనుకుంటూ రోజులు నెట్టుకొచ్చేనా- ఇంతలో ఎదిగి కూచుంది''అంటూ హేంగర్‌కున్న చొక్కా తీసి తగిలించుకుని, కండువా ఒకటి భుజాన వేసుకొని బయలుదేరాడు ముకుందరావు.**

# అవంతి ది గ్రేట్!

డా॥ కొసుల నాగభూషణం

''తొందరగా రండి! బాయిలర్లో బొగ్గులు పడేస్తున్నాను వేణ్ణీళ్లకి'' అని భర్తగారి ఎదిగిన క్రాపుని మరి కాసేపటికి కనిపించదనే సానుభూతితో అతనా వీధి మలుపు తిరిగేంత వరకు వాకిట్లోనే నుంచుని తదేకంగా చూసింది సావిత్రమ్మ.

అవి వేసవి రోజులు. సాయంత్రం నాలుగు గంటలయినా మలమల మాడ్చేస్తోంది ఎండ. ముకుందరావు తలని తడిమి చూసుకుంటూ నేల మీద పడుతున్న తన నీడని చూస్తూ నడుస్తున్నాడు.

అసలు మొదట్నుంచీ ముకుందరావుకి క్రాపు మీద గురి ఎక్కువ. ఒత్తుగా, నల్లగా వంకీలు తిరిగి ఉవ్వెత్తుగా వున్న క్రాఫంటే ఎంతో ఇష్టం అతనికి. కొంపదీసి అలాంటి క్రాఫే అతనికి లేకపోయింది. ఆముదం పెట్టి, అద్దం ముందు అరగంట నుంచుని, ఎంతో జాగ్రతగా దువ్వెనతో నొక్కిపట్టి దువ్వితే గానీ అతని వెంట్రుకలు అణగవు. ఒకవేళ అలా అణిగినా ఓ అయిదు నిమిషాల మించి అవి అలాగే వుండవు. దానితో తల దువ్వుకోవడం మళ్లీ మొదలు. వెనక తను స్టూడెంటు గిరి వెలగబెడుతున్నప్పుడు ఓ దువ్వెన జేబులోనే వుంచుకొని తలని పైపైనే అలా అలా అలవాటుగా దువ్వుకునేవాడు. కాని వయస్సు పెరిగి, మనసు ఎదిగి అనేకానేకమైన కోణాల్లోంచి మనిషి విలువలు తెలిసొచ్చింతర్వాత ఈ పైపై మెరుగుల్లో ఏమీ లేదనే ఆత్మజ్ఞానం ఒకటి కలిగి క్రమంగా ఆ అలవాటుని మానుకున్నాడు. ఇప్పుడు అతనికున్న ఈ అణగని క్రాఫే హుందగా, అందంగా కూడా కనపడుతోంది అతని కంటికి.

అయితే వచ్చిన చిక్కల్లా అతనికి ఈ క్రాపు చేయించుకోవడంలోనే వుంది. అదేమిటో అర్థంకాదు గాని క్రాపు చేయించుకున్న కొన్నాళ్ల వరకూ తన భార్యతో అన్నట్లుగా తల ఏదో బోసిగా వున్నట్లనిపిస్తుంది. మొహం పీక్కుపోయినట్లు కనిపిస్తుంది. ప్రతిసారీ క్రాపు చేయించుకున్నప్పుడల్లా, తన కళ్లకి తనే ఏదో పోగొట్టుకున్నవాడల్లే కనబడడం మరీ వింతగా తోస్తుంది.

ఆ మధ్యన ఓసారి తను క్రాపుచేయించుకున్న తొలి వారంలో ఏదో పని మీద చలపతింటికి వెళ్లాడు. మాటల మధ్యలో తననే గమనిస్తూ చలపతితో అంది అతని భార్య. 'అన్నయ్య చాలా చిక్కిపోయారండీ! కూతురి పెళ్లి చేసిన తర్వాత కూడా అన్నయ్యగారికేం దిగులో!'

అప్పుడు చలపతి అన్నాడు గదా! ''అబ్బే అదేం లేదు లేవే! క్రాపు చేయించుకున్నాడుగా! మొదట్లో ఎవరికయినా మొహం ఇలా దిగులుగానే కనిపిస్తుంది.''

ఆ మాటలతో అప్పుడు తాను పొందిన ఓదార్పుని తలచుకొని తనలో తనే చిన్నగా నవ్వుకున్నాడు ముకుందరావు. ఎండ వేడికి తట్టుకోలేక తొందర తొందరగా నడిచి, రోడ్డు పక్కనున్న వేపచెట్టు కిందకి చేరుకున్నాడు. ఇక అక్కడినించి వరుసగా, దట్టంగా వున్న వేపచెట్ల నీడల్లో ఇంకెంత దూరం నడిచినా ఫర్వాలేదనుకున్నాడు. గుండెల నిండుగా గాలి పీల్చుకొని వదులుతూ అలా తిన్నగా ఓసారి అటు వైపు చూశాడు. చూడడంతోనే చిన్నపిల్లవాడిలా ఎగిరి గంతేశాడు. అందుకు కారణం-అక్కడ ఆ మధ్యే కొత్తగా వెలిసిన సెలూన్!

నెత్తిని మాడ్చే ఆ ఎండలో చలివేంద్రంలా... ఒయాసిస్సులా కనిపించిన ఆ సెలూన్‌నే పరీక్షగా చూస్తూ నడిచేడు ముకుందరావు. షాపుకి దగ్గరగా వెళ్లి, దాని ముందు వేసిన పొడవాటి బల్లమీద కూర్చున్నాడు. అలా కూచోబోతూ ఆ షాపువైపు చూసిన ముకుందరావునీ, అతని తలనీ పరకాయించి చూస్తూ పలకరింపుగా నవ్వాడు ఆ షాపులోని కుర్రాడు. ఎందుకో అప్రయత్నంగా ముకుందరావు నవ్వాడు.

ఆ అబ్బాయికి పాతికేళ్లుంటాయి. అతనప్పటికి లోపల ఇంకెవరికో క్రాపు చేస్తున్నాడు. కుర్రాడు భలే చలాకీగా వున్నాడు. కనుముక్కు తీరు అందంగా వుంది. పుష్టిగా వున్న శరీరం. కట్‌బనియన్‌లో దృఢంగా కనబడుతున్న ఛాతీ, అన్నిటినీ మించి అతని దృష్టిని ఆకర్షించింది ఆ కుర్రాడి క్రాపు! బాగా వంకీలు తిరిగి ఒత్తుగా, నల్లగా వున్న ఆకుర్రాడి క్రాపునే కళ్లప్పగించి చూస్తున్నాడు ముకుందరావు.

ఇంతలో అతను క్రాపు చెయ్యడం పూర్తయ్యింది.

# సాధారణ ప్రచురణ (రూ. 1,000)కు ఎంపికయిన కథ

''కమిన్ సార్! కూచుందురు రండి!'' అంటూ రివాల్వింగ్ ఛెయిర్ని పొడిబట్టతో ఓ దులుపు దులిపి రావుగారిని ఆహ్వానించేడు ఆ కుర్రాడు.

ముకుందరావు వెళ్లి రివాల్వింగ్ ఛెయిర్లో కూచున్నాడు. ఆ అబ్బాయి అప్పటి వరకూ క్రాఫింగ్కి ఉపయోగించిన సరంజామానంత పక్కన ప్లాస్టిక్ బక్కెట్లో వేసాడు. నీళ్లతో శుభ్రంగా కడిగి అన్నిటికీ డెటాల్ పట్టించేడు. చేతులు సోపుతో కడుక్కుని, తెల్లటి టవల్తో తుడుచుకున్నాడు. కడిగిన సరంజామానంతా తీసి ఛెయిర్కి ముందున్న పొడవాటి స్టాండు మీద అమర్చుకున్నాడు. అతని ప్రతీ కదలికనీ కన్నార్పకుండా, పరిశీలించిన ముకుందరావుకి అతనంటే ఏమిటో ఓ రకమైన ఆప్యాయత ఏర్పడింది. ''సార్! క్రాఫేనా?'' అని అడుగుతూనే ఆ అబ్బాయి ముకుందరావు చొక్కా కున్న పై గుండీలు విప్పేడు. వదులైన కాలర్ని మెడ చుట్టూ లోపలకి మడిచి, మెడ నుంచి నడుం వరకూ అతని శరీరాన్ని తెల్లటి బట్టతో కప్పాడు. ముకుంద రావు కళ్లలోకి చూస్తూ మరో చిరునవ్వు బహూక రించాడు.

''చెరగని నవ్వులోనే వుంది ఆ కళ!'' అనుకు న్నాడు ముకుందరావు.

ఆ అబ్బాయి అతని తలమీద నీళ్లని స్ప్రే చేశాడు. అవసరాన్ని బట్టి రివాల్వింగ్ ఛెయిర్లో అతన్ని అటూ ఇటూ తిప్పుతున్నాడు. ఆ అబ్బాయికి అనువుగా ముకుందరావు తన తలని తిప్పుతూ, వంచుతూనే ఆ సెలూన్లోని గోడలకేసి చూస్తున్నాడు.

చెక్కలతో విశాలంగా బంకులా తయారుచేసిన ఆ సెలూన్లోని గోడలకి చక్కగా ఫ్రేములు కట్టించిన సీనరీలు కొన్ని తగిలించివున్నాయి. అవి ఆ అబ్బాయి పట్ల అతనికి కలిగిన ఆప్యాయతని ఇనుమడింపచే సాయి. సాధారణంగా సెలూన్లలో ఎలాంటి క్యాలండర్లుంటాయో, ఎంతటి దిగంబరత్వం, ఆ గోడల్లో దిగబడి వుంటుందో అందరికీ తెలిసిన విష యమే. కానీ ఇక్కడ అందుకు పూర్తి విరుద్ధంగా ఆ పెయింటింగ్స్లో కళారాధనని చూస్తున్నాడతను.

కణ్వాశ్రమంలో అనసూయా ప్రియంవదలతో కలిసి మాలతీ మందారాలకు నీళ్లు పోస్తున్న శకుంతల. అది రవివర్మ చిత్రం! అర్థనిమిలిత నేత్రాలతో వేణువూదుతూ శిలావితర్దిక పారవశ్యంతో మునిగి నిల్చున్న రాధ! సాయంవేళ ఎడ్లబండిలో ఇంటికేసి బయలుదేరిన రైతు దంపతుల రాగ జీవనం! అన్నీ ఇలాంటి చిత్రాలే! వీటిని బట్టి ఆ అబ్బాయి కళాహృదయాన్ని అంచనా వేసుకున్నాడు ముకుందరావు.

కాలం గడిచినట్లే తెలియలేదు గాని క్రాఫింగు మాత్రం పూర్తయింది. ఆ అబ్బాయి షేవింగ్ క్రీమ్ని బ్రష్తో సాది గడ్డం గాయడానికి పూనుకున్నాడు. అదే సమయానికి ఎవరో కాలేజీ స్టూడెంట్లా వున్న కుర్రాడొకడు పుస్తకాలు పట్టుకొని సెలూన్లోకి అడు గుపెడుతూ అన్నాడు. ''అవంతీ! భలే ఎక్స్పెక్ట్ చేసే వురా! నువ్వు చెప్పిన ప్రశ్నలే దిగేయి మాకివాళ పేప ర్లో!''

ఆ వచ్చిన కుర్రాడికి ఈ అబ్బాయి-అవంతి-అదే చిరునవ్వుని బహూకరిస్తూ ''అలా కూచో! జస్ట్ ఏ మినిట్ వచ్చేస్తా!'' అని షేవింగ్ ప్రారంభించాడు.

అవంతి-అందమైన పేరు! దానికి తోడు కుర్రాడు బాగా చదువుకున్నట్లే వున్నాడు. చదువుతో బాటుగా సంస్కారమూ వున్నవాడు. మరి ఈ పనిలో వున్నాడే మిటి? అనుకున్నాడు ముకుందరావు.

ఇంతలో అతని షేవింగూ పూర్తయింది. మామూలుగా అయితే ముకుందరావు ఈ పాటికి ఎదురుగా వుండే అద్దంలో తన మొహాన్ని రకరకాల కోణాల్లోంచి పరీక్షించి మరీ చూసుకునేవాడు. కాని ఇప్పుడతని దృష్టి తన మొహం మీద లేదు. అతను చెంగును కుర్చీలోంచి దిగాడు. చొక్కా జేబులోంచి ఏదో నోటు తీసి అవంతి చేతికిచ్చాడు. తిరిగి అత నెంత ఇచ్చాడో కూడా చూడకుండా ఆ ఇచ్చి డబ్బుల్ని అలాగే తీసి జేబులో వేసుకున్నాడు. సెలూన్ మెట్లు దిగి ఏదో అడగాలనుకున్నవాడల్లే కాస్సేపు అక్కడే నిల్చున్నాడు.

అవంతి అతని వాలకం చూసి 'ఏమిటి సార్! ఆ అడగాలనుకుంటున్నదేమిటో అడగరేం?' అన్నాడు.

ముకుందరావు గతుక్కుమన్నాడు. తన మన సుని ఇట్టే పసిగట్టగలిగిన అతని అవగాహనాశక్తిని మనస్సులోనే మెచ్చుకున్నాడు. మరి తిన్నగా బలం పుంజుకొని నవ్వుతూ అడిగాడు ''అబ్బాయ్! చదువు కున్నావాడిలా వున్నావ్? ఎందాకా చదివావ్?''

ఆ మాట విని అవంతి సెలూన్ మెట్లు దిగివచ్చి, ముకుందరావు పక్కనే నిలబడి, షాప్ ముందటి నేమ్ బోర్డ్ చూపుతూ అందులో వున్న దాన్ని చదువుతున్న ట్లుగా అన్నాడు. ''అవంతి హెయిర్ డ్రెస్సింగ్ సెలూ న్!ప్రొప్. మిస్టర్ అవంతీనాథ్, బిఏ, ఎంఏ, డిస్‌కంటి న్యూడ్''

అవంతి, అలా చదివాడే గానీ బోర్డులో అతని పేరు పక్కన బిఏ అనే అక్షరాలు లేవు.

ముకుందరావు ప్రశంసాపూర్వకంగా తల పంకించేడు. ''అయితే నువ్వు గ్రాడ్యుయేట్వన్నమా ట'' అన్నాడు అని, ''మరి పేరు పక్కన డిగ్రీ చేర్చుకో లేదేం?'' అని అడిగాడు.

''డిగ్రీ పరువు నిలుపుదామని!'' తుపాకీ తూటాలా దూసుకొచ్చింది సమాధానం. అది ముకుందరావుని దెబ్బతీసినట్టయింది. అతను గిరు క్కున తిరిగాడు. వెనకి నుంచి అవంతి తనని పిలుస్తున్నా వినిపించుకోలేదు. అందుకనే చిన్నబో యిన అవంతి మొహాన్ని చూడలేకపోయాడు.


ముకుందరావు ఇంటి ముఖం పట్టాడు. నింపా దిగా అడుగులేసి నడుస్తూ అవంతిని గురించి ఆలోచి స్తున్నాడు.

అవంతి ఎంత నిష్టూరంగా చెప్పాడు చివరి మాటని! ఎంఏ చదువుతూ, మధ్యలో మానేయ్యడానికి, బిఏ చదివిన కుర్రాడు ఇలాంటి పనిలో స్థిరపడడానికీ బహుశా బలమైన కారణాలేవో వుండివుండాలి! అసలీ రోజుల్లో అవంతి లాంటి అబ్బాలుండం నిజంగా ఎంతో ఆశ్చర్యం! ప్రతి ఏడూ లక్షలాదిమంది నిరుద్యోగులు చేతికి సర్టిఫికెట్లు ఇచ్చి గెంటేసే అనెంప్లాయ్మెంట్ ఇండస్ట్రీలనబడే యూనివర్శిటీలు, పెళ్లిపత్రికల్లో పేర్ల పక్కన వేసుకోవ డానికి మాత్రమే పనికొచ్చే డిగ్రీలు, వున్న ఆస్తిపాస్తు లన్నీ తగలేసి చదివినా ఒక్క పూటన్నమయినా సంపాయించి పెట్టలేని సర్టిఫికెట్లు, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్లు, తిరుగాడే నిరుద్యోగులు, మెంటల్ పేషెంట్లు, ఆకలి చావులు- ఎంత భయంకరం మన విద్యావిధానం! ఎంత దారుణం ఈ జీతం రాళ్ల ఉద్యో గవ్యామోహం!

అసలు దీనికంతటికీ కారణం డిగ్రీ చదువులు చదవడమే నాగరికతకి చిహ్నం అనుకోవడం, సాధించిన డిగ్రీకి ఏదో ఒక ప్రభుత్వోద్యోగం చెయ్య డమే ప్రయోజనం అనుకోవడం, అందరూ ఆ ఉద్యో గాల కోసం ఎగబడడం! మొత్తానికి చదువుకున్నావా ళ్లందరూ ఉత్పత్తుల మీద అజమాయిషీ చేసే ఉద్యో గాలే కోరుకుంటారు తప్ప ఆ ఉత్పత్తిని పెంచే శ్రామిక స్థానాన్ని అంగీకరించరు. అదే ఇంతటి నిరుద్యోగ సమస్యకీ మూలకారణం. అని మిత్రులతో వాదించే వాడు ముకుందరావు. దీనికి పరిష్కారం విద్యార్థుల మనసుల్లోనే వుందనీ, అందుకు అవంతిలాంటి యువకులే సాక్ష్యం అనీ ఇప్పుడు దృఢపరుచుకు న్నాడు.

అదీ గాక ముకుందరావు ఈ తరం కుర్రకారునీ, వాళ్ల ప్రవర్తనీ అంతగా సమర్థించలేక విలవిల్లాడిపో తుంటాడు అప్పుడప్పుడు! ఏమిటో, వీళ్లు, వీళ్ల బోడి డిగ్నిటీలు! చిన్నపని చేసుకోవాలనుకున్నా అబ్బే! ఇది మా డిగ్నిటీకి లోపం!'' అనుకుంటారు. తన కళ్లతోనే ఎంతమందిని చూడ లేదు తను అలాంటి షోగ్గాళ్లని!

స్టాండులో బస్సు దిగి, పట్టుకొచ్చిన సూట్కేస్ని హాస్టల్ వరకూ మోసుకెళ్లడం నామోషీ అనుకుని ఆ ఇంత దూరానికే రిక్షా చేయించుకునేవాడొకడు, వీధిలో నడుస్తూ నడుస్తూ పట్టీలు తెగిన చెప్పుల్ని చేత్తో పట్టుకోవడానికి జంకి, అటూ ఇటూ చూసి అదేదో అంటరానిదైనట్లు పేపర్లో చుట్టి తీసు కుపోయేవాడొకడు. జేబులో సరిపడే చిల్లరు



న్నప్పటికీ హోటల్ కౌంటర్లో డాబుగా ఏ యాభయ్యో, వందో నోటు తీస ఇచ్చేవాడొకడు. నల్లగా బక్కచిక్కి నాజుగ్గా కనిపించక పక్కనే నడుస్తున్న కన్నతండ్రిని స్నేహితులెదురైనా, 'మా నాన్నగారు' అని ఆప్యాయంగా చెప్పుకోలేనివాడొకడు. మాసిన మొలబట్టతో మాడే కడుపుతో 'బాబూ! ధర్మం' అని చెయ్యి చాపిన ముసలమ్మని కనీసం ఆమె వైపయినా చూడకుండా దూరంగా వెళ్లిపొమ్మని వుంగరాల వేళ్లతో విసిరికొట్టేవాడొకడు. ఎర్రగా బుర్రగా వున్న అమ్మాయిని ఎదుటివాడి చెల్లెలని తెలియకుండా కన్నుగీటివాడి దగ్గర చావుదెబ్బలు తినేవాడొకడు. నెత్తిమీది బరువుతో, చెమటోడుతున్న శరీరంతో ఎండలో నడిచివెళ్లే నల్లని పల్లెటూరి రైతుని చూసి పళ్లికిలించేవాడొకడు. చదువు పూర్తి చేసుకుని, బస్తీ నుంచి పల్లెకొచ్చి, తమ వృత్తిపనే చేతగాక ఎప్పుడూ పేకాటలో పొద్దుపుచ్చేవాడొకడు. తనతో పాటే చదువుకుని, ఇంటికి రాగానే హాయిగా మేడిపట్టుకుని, పొలం దున్నుకునే స్నేహితుణ్ని వేలెత్తి చూపి వెక్కిరించేవాడొకడు.

చెప్పుకుంటూ పోతే, ఇలాంటి వాళ్లు ఇంకెంతమందో మన మధ్య! అదీ ఉద్యోగం, సద్యోగం సంపాయించిపెట్టలేని వుత్తుత్తి చదువులు చదివి! వీళ్లందరినీ ఓ వైపు, ఈ అవంతిని మరోవైపు నిలిపి బేరీజు వేస్తే నిజంగా ఎంత ఆదర్శ యువకుడు అవంతి! అందులోనూ ప్రతిదీ సమస్యగా తయారవుతున్న ఈ రోజుల్లో ఈ నిరుద్యోగ సమస్య మీద సిద్ధాంత రాద్ధాంతాలు! ఇంతా చేస్తే మన దేశంలో అక్షరాస్యుల శాతం నలభై లోపు! ఇదే మన మనస్తత్వంతో అక్షరాస్యుల సంఖ్య ఆశించినంతగా పెరిగితే? అప్పుడీ నిరుద్యోగస్థితి ఇంకెంత తీవ్రంగా వుంటుందో వూహించడానికే హడలిపోయాడు ముకుందరావు.

వెనకటి రోజుల్లో భుక్తికోసం ఏర్పడిన వృత్తులు, వాటిననుసరించి ఏర్పడిన కులాలు, వర్గాలు, ఆర్థిక అసమానతలు ఇలా అస్తవ్యస్తమైన మన ఆర్థిక వ్యవస్థని సంస్కరించవలసిన మన విద్యావిధానం ఇంకా ప్రయోగదశనే దాటి రాలేదు. అసలు సక్రమమైన సంస్కరణ దృష్టే అందులో లేదు. అసలు దృష్టాంతాలు మన సర్టిఫికెట్లలో కనిపించే మతం, కులం అనే కాలమ్‌లు! వీటికంతా అవీ, ఇవీ అంటూ సవాలక్ష కారణాలను చూపవచ్చు మేధావులు. కానీ అవేవీ సమంజసమైనవి కావనీ, మనం అనుసరిస్తున్న ఈ విద్యావిధానం వల్ల ఎందరో నిరుపేదలైన నిరుద్యోగ యువతీ యువ కుల జీవితాలు దారం తెగిన గాలిపటల్లా నిరాధారంగా ఏ దిక్కుకో కొట్టుకుపోతున్నాయనీ సానుభూతి ప్రదర్శిస్తాడు ముకుందరావు. ఇలా ఆలోచిస్తూనే ఇల్లు చేరుకున్న అతని క్రాపుని చూసి అతనిమీదే బోలెడు సానుభూతిని ప్రదర్శించిందతి సావిత్రమ్మ.

మరి కొన్నాళ్లకి అతని క్రాపు పాతబడిపోతూ వున్న రోజుల్లో ఓ సాయంత్రం చల్లగాలికి అలా బయట కాసేపు నడిచి వద్దామని బయలుదేరాడు



ముకుందరావు. అప్పుడే ఆకాశంలో తెల్ల తెల్లని మబ్బులు చెదురుమదురుగా తారాడుతున్నాయి. గాలి చల్లగా వీస్తోంది. అట్ల పెనంలా కాగిన భూమ్మీద పలపలా నాలుగు చినుకులు రాలితే ఎంత హాయిగా వుంటుందో! అనుకున్నాడు ముకుందరావు. వాచీ వంక చూసుకున్నాడు. ఐదయింది. ఆదివారం అయినందువల్ల రోడ్లు రద్దీగానే వున్నాయి. అయినా చల్లగా వున్న ఆ వాతావరణంలో ఒక్కసారి అలా పార్కు వంక వెళ్లొస్తే బావుంటుందనిపించింది అతనికి. వెంటనే పార్కుకేసి నడక సాగించాడు.

జన సమ్మర్ధమైన ఆ నగరంలో ఖాళీగా కాస్తంత ప్రశాంతంగా కనిపించే స్థలం-పార్కు! ముకుందరావు అందులోకి ప్రవేశించాడు. ఆ పార్కు నిండా చిన్నపిల్లలే! తూనీగలల్లే అంతటా తిరుగుతూ, కేకలుపెడుతూ ఆడుకుంటున్న చిన్నపిల్లలు! వాళ్లని చూస్తూ కాళ్లకడ్డం పడుతున్న వాళ్ల నుంచి తప్పించుకుంటూ మధ్యలో పచ్చికమీదకెళ్లి కూచున్నాడు ముకుందరావు. కూచుని చుట్టూ చూస్తున్నాడు. అప్పుడు కనిపించాడతనికి- దూరంగా సిమెంటు బెంచీ మీద కూర్చుని ఆకాశం కేసి చూస్తూ అవంతి!

ముకుందరావుకి ఎందుకో అతన్ని పలకరించాలనిపించింది. అనిపించడం తడవుగా చిన్నపిల్లాడిలా చెయ్యెత్తి వూపుతూ 'అవంతీ' అని పేరు పెట్టి పిలిచాడు.

ఆ కేకకి తల దించి ఇటు తిరిగి చూసాడు అవంతి. వెంటనే లేచి దగ్గరికొస్తూ ''మీరా! నమస్కారం సార్!'' అన్నాడు. అతను చాలా హుషారుగా వున్నాడు. తెల్లటి ప్యాంటు మీద పల్చటి తెలుపు నలుపు నిలువు చారల ఫుల్ షర్టు తొడుక్కున్నాడు. చొక్కా చేతుల్ని కఫ్ మీదుగా రెండు మడతలు పైకి మడిచాడు. ముకుందరావుకి దగ్గరగా వచ్చి దుబ్బుగా, పచ్చగా వున్న పచ్చికమీద కర్చీఫ్ తీసి పరుచుకొని కూర్చున్నాడు. తర్వాత, అతని వైపు చూస్తూ వినయంగా అడిగాడు. 'ఆరోజు నేనన్న మాటకి మీకు కోపం వచ్చింది కదూ!'

''అబ్బే, ఏం లేదే!'' ముకుందరావు సర్దిచెప్పబోయాడు.

''ఏమిటో సార్! చదువు మాటొచ్చేసరికి ఆ ఆక్రోశం ఆపుకోలేకపోయాను. కారణం-మీకు చెప్పగలిగిన వాడిని కాదు గాని మీకూ తెలుసు. ఈ రోజుల్లో డిగ్రీలకున్న విలువ! చదువుకునే రోజుల్లో ఎంతో గొప్పగా ఫీలయ్యాను. నేనూ డిగ్రీ చదువుతున్నానని! ఆ డిగ్రీతో నేనేదో పెద్దగా సాధించగలననీ, దానితో నా కష్టాలు తీరిపోతాయనీ అనుకున్నాను. కానీ పరిస్థితులు వక్రించి, నిజజీవితంలో దాని ప్రయోజకత్వం ఎంతటితో నేనుగా తెలుసుకున్న తర్వాత ఈ చదువుల పట్ల నాకున్న విలువలన్నీ తారుమారయ్యాయి.''

క్షణం సేపు తన ఉద్వేగాన్ని ఆపుకొని ముకుందరావు వైపు చూస్తూ తిన్నగా చెప్పుకుపోసాగాడు అవంతి. ''నిజం సార్! మీతో నేను ఎమ్.ఏ డిస్‌కంటిన్యూ చేసానని చెప్పాను కదూ! అందుకు కారణం సాధారణంగా, నాలాంటి వాళ్లకి ఎదురయ్యే ఆర్థిక దుస్థితి! అప్పటి వరకూ మా నాన్నగారుండేవారు. ఇప్పుడు నేను చేస్తున్న పని చేసేవారు. అది మా తాతముత్తాతల నుంచీ మాకు సంక్రమించిన వృత్తి. ఆ విషయం చెప్పుకోవడానికి నాకేం నామోషీ లేదు. మరి జరిగిందేమిటంటే నాలుగేళ్ల క్రితం మా నాన్నగారికి పక్షవాతం వచ్చి మంచం పట్టి పోయారు. దాంతోటే మా పాట్లు ప్రారంభమయ్యాయి. నేను చదువు చాలించాను. డిగ్రీ సర్టిఫికెట్‌తో కనిపించిన ప్రతీ వుద్యోగానికీ అప్లయ్ చేసాను. కంటి తుడుపుగా వచ్చిన ఇంటర్వ్యూలకల్లా తిరిగాను. ఫలితం లేకపోయింది. ఆలోచించాను. మా నాన్నగారి మార్గాన్నే అనుసరించాను. బహుశా మీరు నమ్మరేమో రెండు మూడు నెలల్లోనే ఈపని నేర్చుకున్నాను. వృత్తులు మనుషుల్ని కులాల కింద విడగొట్టడం కోసం కాదు. భుక్తి గడవడం కోసం అని తెలుసుకున్నాను. అలాంటి వృత్తి విద్య అది ఏదయినా ఫర్వాలేదు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నేర్చుకోవాలన్నదే నేను ఇచ్చే సందేశం! అలా నేను నేర్చుకున్నాను గనకే ఒకప్పుడు నా సర్టిఫికెట్లు సంపాయించి పెట్టలేని అన్నాన్ని ఇవాళ మా ఇంటిల్లిపాదికీ సంపాయించుకుంటున్నాను. నా వృత్తి ఆర్జనలో నేను బతుకున్నప్పుడే 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అంటే ఏమిటో అర్థం చేసుకున్నాను. మరిప్పుడు మీరే చెప్పండి సార్! అక్కడ బోర్డులో నా పేరు పక్కన డిగ్రీని చేరిస్తే ఆ డిగ్రీ విలువని అర్థం చేసుకుంటుందా ఈ సమాజం?''

అంతా చెప్పి అవంతి చివర ప్రశ్నతో ఇబ్బంది పెట్టాడు ముకుందరావుని. అయినా ఆయన అంతలోనే తేరుకుని ప్రశంసాపూర్వకంగా అవంతి వీపును మెల్లగా చరిచాడు.

''తప్పని సరిగా అర్థం చేసుకుంటుంది అవంతీ! అంతేకాదు సమాజం విలువని గుర్తిస్తుంది, గౌరవిస్తుంది. ఆరోజు కూడా ఎంతో దూరంలో లేదు'' అని భరోసా ఇచ్చాను.

అంతలోనే తన మనస్సులో ఏదో తళుక్కున మెరిసినట్టయి, ఆరా తీస్తున్నట్లుగా అడిగాను 'అబ్బాయ్! ఇంతకీ నీకు పెళ్లయిందా?'

''లేదండీ'' అందంగా సిగ్గుపడుతూ చెప్పాడు అవంతి.

ఆ సమాధానంతో ముకుందరావు మొహం విప్పారింది. అతని కళ్లముందు డిగ్రీ వరకూ చదివి, గ్రాడ్యుయేట్‌ని, అదీ ఉద్యోగస్తుడినీ తప్ప మరొకర్ని చేసుకోనని మోరాయించి కూచున్న అతని స్నేహితులమ్మాయి మొహం ఒకటి మెదిలింది. అయినా చెయ్యి దాటిపోయింది. అవంతి లాంటి అబ్బాయిని చేసుకునే అదృష్టం ఆ అమ్మాయికి లేదనుకున్నాడు.

అవంతి చెప్పసాగాడు. ''నాకీ మధ్యే పెళ్లి నిశ్చయమయింది సార్! అవతల నా ఫ్రెండొకడున్నాడు. గొప్పలకు కాదు గాని మీకు విషయం తెలియడం కోసం చెబుతున్నాను. అతని కులం వేరు. అతనూ నాలాగే జీవితంలో ఎదురు దెబ్బలు తిని, ఇప్పుడిప్పుడే తన కాళ్ల మీద తను నిలబడే ప్రయత్నం చేస్తున్నాడు. అతనికో చెల్లెలుంది. డిగ్రీ చదువుకుంది. నేనామెని చేసుకుంటున్నాను. కట్నాల ప్రసక్తి లేదు. ఆడంబరాలు లేవు. అసలు మా పెళ్లి జరగబోతున్నది కనీసం రిజిస్ట్రార్ ఆఫీసులో కూడా కాదు. మీలాంటి పెద్దల సమక్షంలో. మా మనసులే సాక్షిగా! మరి మీ ఆశీస్సులే మాకు అక్షింతలయితే అంతకు మించిన ఆనందం నాకు మరొకటి లేదు.''

ఈ మాటతో తనని పెళ్లి పెద్దగా అధికారం చెలాయించే అవకాశం ఒకటి చేజారిపోయింది కదా! అని బాధపడ్డా అవంతి చొరవనీ, ఆదర్శభావాలనీ మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాడు ముకుందరావు.

''ఐ రియల్లీ అడ్మయిర్ యూ మైడియర్ యంగ్ బాయ్! రా! ఈ సంతోషసమయంలో నీకో చక్కటి కాఫీ ఇప్పిస్తాను.'' అంటూ తన చెంగున లేచి, అవంతికి చెయ్యందిచాడు.

చప్పున అతని చేతిని అందుకొని పైకి లేచి 'థ్యాంక్యూ సార్' అంటూ అతన్ని అనుసరించాడు అవంతి ది గ్రేట్- ఏ సెల్ఫ్ ఎంప్లాయ్!

★

## రచయిత పరిచయం



చెన్నై డి.జి.వైష్ణవ కళాశాలలో తెలుగు రీడరు, శాఖాధ్యక్షుడుగా ఉద్యోగం. సాహితీ జీవనం మాటకొస్తే- కీ.శే. నూతలపాటి గంగాధరం గారి శిష్యుణ్ణి. హైస్కూలు రోజుల్లో వారి స్ఫూర్తితో పద్య రచన ప్రారంభించాను. కథలు, కవితలు, వ్యాసాలు, అనువాదాలు చెయ్యి తిరిగిన ప్రక్రియలు. కృష్ణాపత్రిక, భారతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, ఉదయం, యువ, జ్యోతి, విజయ, నీలిమలాంటి పత్రికలు ఆనాడు నన్నెంతగానో ప్రోత్సహించాయి. శ్రీరామకృష్ణా మిషన్ చెన్నైలోని ఉపాధ్యాయులకు జరిపిన పద్య కవితల పోటీలోను, ఆంధ్రభూమి కథల పోటీలోను ప్రథమ, ద్వితీయ బహుమతుల్ని, 'రచన' సంస్థ నుంచి 'రసధుని' అవార్డుని అందుకున్నాను. చెన్నపురి తెలుగు సాంస్కృతిక వారసత్వంలో గత పాతికేళ్ళుగా నేనూ ఓ భాగస్వామిని. సభలు, సమావేశాల, కవి సమ్మేళనాలు, సెమినార్లు నిత్య వ్యసనాలు. దేవులపల్లి, మధురాంతకం, డా.తంగిరాల, బిఎస్సార్, విఎకె, డా.పప్పు, డా.సినారె లాంటి సాహితీవేత్తల ఆదరాభిమానాలకు నోచుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తాను. ప్రస్తుతం 'వసుధ' మాసపత్రికలో 'ఆముక్త మాల్యద' వచనానువాదం సీరియల్ రాస్తున్నాను. నాకథను ఎంపికచేసిన నవ్య వీక్లీ-సి.పి.బ్రౌన్ అకాడమీకి కృతజ్ఞుణ్ని.

-డా.కాసల నాగభూషణం